క్లుప్తంగా

రైతుబజారు స్టాళ్లకు డ్రా



రైతులకు స్టాళ్ల టోకెన్లు అందిస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజారులోని స్టాళ్లకు శుక్రవారం ఈవో కొండబాబు డ్రా తీసి రైతులకు టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు రైతుల స్టాళ్లకు డ్రా తీస్తున్నట్లు తెలిపారు. ఉదయం రైతులు 95 మందికి 63 స్టాళ్లు, సాయంత్రం రైతులు 65 మందికి 63 స్టాళ్లు కేటాయించామన్నారు. కార్యక్రమంలో రైతుబజారు సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

సీతంపేటలో మెగా ఫాగింగ్



ఫాగింగ్ చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సీతంపేట: దోమల నిర్మూలనకు 25వ వార్డులోని పలు ప్రాంతాల్లో శుక్రవారం జీవీఎంసీ సిబ్బంది మెగా ఫాగింగ్ నిర్వహించారు. సీతంపేట, బీటీఆర్ కాలనీ, హరిజన వీధి, కనకమ్మ వీధి, గణేష్‌నగర్ 1, 2, 3, గొల్లవీధి 1, 2, 3, పాత చేపల బజారు, రాజేంద్రనగర్, శాంతిపురం, మధురానగర్, గురుద్వారా హైవే ప్రాంతాల్లో ఫాగింగ్ చేపట్టారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని, వారానికి ఒక రోజు డ్రైడే పాటించాలని, తద్వారా దోమల పెరుగుదలను అరికట్టవచ్చని జీవీఎంసీ మలేరియా సూపర్‌వైజర్ కె.శివ సత్యనారాయణ, ఆపరేటర్ రాంబాబు ప్రజలకు అవగాహన కల్పించారు.

పోలీస్ స్టేషన్ల ఆవరణలో చెట్ల తొలగింపు



విద్యుత్ వైర్లకు తగులుతున్న చెట్టు కొమ్మలు తొలగిస్తున్న సిబ్బంది

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్, ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ల ఆవరణలోని చెట్లను శుక్రవారం తొలగించారు. విద్యుత్ వైర్లు చెట్టు కొమ్మలకు తగలడంతో సీఐలు ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టారు. దీంతో రెండు పోలీస్ స్టేషన్లు క్లియర్‌గా కనిపిస్తున్నాయి. క్రైం పోలీస్ స్టేషన్ ప్రాంతంలో చెట్లు తొలగించి శుభ్రం చేస్తున్నారు. ఫిర్యాదుదారులకు నీడ పోవడంతో గట్టుపై వేచి ఉంటున్నారు.

ఆర్పీల సమస్యలపై ఆరా



ఆర్పీలతో సమావేశమైన శ్యామలదీపిక

సీతమ్మధార: జీవీఎంసీ 49వ వార్డు మురళీనగర్‌కు చెందిన ఆర్పీలతో బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కుమార్తె, బీజేపీ నాయకురాలు శ్యామలదీపిక సమావేశం నిర్వహించారు. వార్డులో పారిశుద్ధ్య సమస్యలతో పాటు డెంగ్యూ సమస్య ఎక్కువగా ఉందని ఆర్పీలు తెలిపారు. స్థానిక స్కూల్‌లో ఉన్న డ్రికింగ్ వాటర్ ట్యాంకులను పరిశీలించాలని కోరారు. విద్యార్థులు నీరు తాగేటప్పుడు ఎలాంటి చెత్త రాకూడదని సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడి స్కూల్ ఆవరణలో బ్లీచింగ్ పౌడర్ వేయించాలని, వ్యాధులు రాకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. ఆర్పీల సమస్యలను తన తండ్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని శ్యామలదీపిక హామీ ఇచ్చారు.

నిర్లక్ష్యం నీడలో ప్రభుత్వ స్థలం

- డంపింగ్ యార్డులా రాజేంద్రనగర్ పార్కు స్థలం
- నిరుపయోగంగా కోట్ల విలువైన ల్యాండ్
- రోత పుట్టిస్తున్న పరిసరాలు



25వ వార్డు రాజేంద్రనగర్‌లో డంపింగ్ యార్డును తలపిస్తున్న పార్కు స్థలం

సీతంపేట: నగరం నడిబొడ్డున కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలం నిర్లక్ష్యానికి గురైంది. జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట మెయిన్ రోడ్ సమీపంలోని ఒకప్పటి రాజేంద్రనగర్ పార్కు స్థలం నిరుపయోగంగా మారింది. సుమారు 4 వేల గజాల స్థలం నేడు డంపింగ్ యార్డును తలపిస్తోంది. పార్కు స్థలాన్ని పట్టించుకునే నాథుడు లేక డెబ్రిస్, చెత్త పడవేసే యార్డుగా మారిపోయింది. రహదారుల ఆక్రమణలో తొలగించిన బడ్డీలు, హోర్డింగ్‌లు, మూలకు చేరిన వాహనాలు ఇక్కడ పడవేస్తున్నారు. ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కు స్థలం రోత పుట్టిస్తోంది. బహిరంగ మల, మూత్ర విసర్జనలతో పార్కు స్థలం అధ్వానంగా మారింది.

ఇదీ 25వ వార్డు పరిస్థితి

సీతంపేటలోని గొల్ల వీధి, హరిజన వీధి, గణేష్‌నగర్, శ్రీహరి వీధి, ముద్దా వీధి, కనకమ్మ వీధి, రెల్లి వీధి, బీటీఆర్ నగర్ ఇవన్నీ 25వ వార్డు పరిధిలోనివి. ఈ ప్రాంతాలన్నీ నాన్‌ప్లానింగ్ ఏరియా కిందకు వస్తాయి. ఇక్కడ సరైన రహదారులు, ఆట స్థలాలు, కాసేపు సేద తీరేందుకు పార్కులు లేవు. శుభకార్యాలు, వేడుకలు జరుపుకోడానికి కల్యాణ మండపాలు లేవు. రైతుబజార్ లేదు. దగ్గర్లో ప్రభుత్వ ఆస్పత్రి లేదు. 4, 5 అడుగుల రోడ్లతో ఇరుగ్గా సందుల్లా ఉంటాయి. ఇళ్ల ఇళ్లు ఆనుకొని దగ్గరగా బాగా కంజెస్ట్‌గా ఉంటాయి. చేయి చాపితే తాకే విధంగా విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతుంటాయి. ఇళ్లకు ఆనుకొని విద్యుత్ స్తంభాలు ఉంటాయి. ఏదైనా అత్యసవరమైతే అంబులెన్స్ వచ్చే సదుపాయం కూడా లేదు. శుభకార్యమైనా, అశుభకార్యమైనా జరుపుకోవడానికి వార్డు పరిధిలో ఒక కల్యాణ మండపం లేదు. ఏ చిన్న ఫంక్షన్ అయినా రోడ్డెక్కాల్సిందే. నగరం నడిబొడ్డున ఉన్న 25వ వార్డు పరిస్థితి ఇది.

ప్రజాప్రయోజనాల కోసం వినియోగించాలి

జీవీఎంసీ స్మార్ట్ సిటీగా గుర్తింపు పొందింది. కానీ ఈ వార్డు మాత్రం అలాగే ఉంది. ప్రజల అవసరాలకు తగినట్టు రాజేంద్రనగర్ పార్కు స్థలాన్ని వినియోగించాలని స్థానికులు కోరుతున్నారు. పార్కు స్థలంలో రైతుబజార్, కల్యాణ మండపం నిర్మిస్తే వార్డు ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నిర్మూలన



శ్రీనివాసనగర్‌లో స్థానికులకు అవగాహన కల్పిస్తున్న డీఎంవో తులసీరాజ్



రైల్వే న్యూకాలనీ హైస్కూళ్ల వద్ద అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ, సచివాలయ సిబ్బంది

సీతంపేట: ప్రజల భాగస్వామ్యంతో దోమల నిర్మూలన సాధ్యమని జిల్లా మలేరియా అధికారి(డీఎంవో) తులసీరాజ్ అన్నారు. 43వ వార్డు శ్రీనివాసనగర్‌లో శుక్రవారం పర్యటించారు. క్షేత్రస్థాయిలో ఫ్రైడే డ్రైడే అమలు తీరును పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి నీటి నిల్వలు పరిశీలించారు. దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన పలు సూచనలు సిబ్బందికి తెలయజేసారు. స్థానికులకు దోమలు పెరిగే ప్రదేశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వర్షా కాలంలో నీరు నిల్వ లేకుండా చూడాలని, లేదంటే దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా జ్వరాలను వ్యాప్తి చేస్తాయన్నారు. వారానికి ఒక రోజు డ్రైడే పటిష్టంగా అమలు చేయడం ద్వారా దోమల పెరుగుదలను అరికట్టవచ్చని చెప్పారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ మనోజ్, సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్, ఎంపీహెచ్‌ఈవో శేషుబాబు, జీవీఎంసీ, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలోని జీవీఎంసీ, కేఎస్ఎం గరల్స్ హైస్కూళ్ల ప్రాంగణంలో శుక్రవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మలేరియా, డెంగ్యూ, ఇతర సీజనల్ వ్యాధులపై వాకర్లు, స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులకు జీవీఎంసీ సిబ్బంది అవగాహన కల్పించారు. వాతావరణ మార్పుల వల్ల కలిగే పరిస్థితులకు తగిన విధంగా జీవనశైలిని మార్చుకోవాలని, దోమలు వ్యాప్తి చెందకుండా నివారణ మార్గాలను అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ, మలేరియా సిబ్బంది, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవం రేపు



కరపత్రికను ఆవిష్కరిస్తున్న కేంద్ర గౌరీ సేవా సంఘం ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: కేంద్ర గౌరీ(గవర) సేవా సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ గవర విద్యార్థులకు ఈ నెల 28న బహుమతుల ప్రదానోత్సవం, అభినందన సభ నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు బుద్ధ శివాజీ తెలిపారు. అక్కయ్యపాలెం జాతీయ రహదారి పక్కన గల పోర్టు కళావాణి ఆడిటోరియం(విశ్వనాథ్ కన్వెన్షన్స్)లో ఆదివారం ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. రైల్వే న్యూకాలనీలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ముందుగా వివరాల కరపత్రికను ఆవిష్కరించారు. శివాజీ మాట్లాడుతూ ఈ ఏడాది విడుదలైన పరీక్షా ఫలితాల్లో 80 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన సుమారు 600 మంది గవర సామాజిక వర్గ విద్యార్థులకు బహుమతులు, దరఖాస్తు చేసుకున్న వారందరికీ కన్సోలేషన్ బహుమతులను అందజేస్తున్నామని చెప్పారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని ఎందరో గవర జాతీయులు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఏడాది నుంచి పేద, అనాథ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ కూడా అందజేస్తామని శివాజీ తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఆడారి శ్యాంప్రసాద్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, డాక్టర్ మళ్ల భాస్కర్ హాజరవుతారని, గవర జాతీయులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి ఆడారి లచ్చ అప్పారావు, ఉపాధ్యక్షులు మొల్లేటి వీరకుమారస్వామి, వేగి సత్యనారాయణ, బొడ్డేటి అప్పారావు, మళ్ల బలరాం, పెంటకోట సంజీవరావు నాయుడు, కోశాధికారి కొణతాల వరహా కోటి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్గిల్ వీరులే యువతకు ఆదర్శం



కార్గిల్ వీరులకు నివాళులర్పిస్తున్న ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ తదితరులు



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న మహిళా కళాశాల ప్రిన్సిపాల్, ఎన్‌సీసీ విభాగం సభ్యులు

దాబాగార్డెన్స్: ఏవీఎన్ కళాశాలలో శుక్రవారం 25వ కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కార్గిల్ వీరులకు కొవ్వొత్తులు వెలగించి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు మాట్లాడుతూ ప్రాణాలు త్యాగం చేసిన కార్గిల్ యుద్ధ వీరుల గురించి విద్యార్థులకు వివరించారు. హవల్దార్ ఎల్.శ్యామలరావు మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో ప్రాణాలు లెక్కచేయకుండా దేశం కోసం పోరాడిన సైనికులను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డీన్ జి.శంకర నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, పి.గాంధీ, పైడి రజని, జీవీఎస్ఎల్ శ్రీనివాసరావు, ఎన్‌సీసీ అధికారులు లెఫ్టినెంట్ కమాండర్ ప్రసన్నకుమార్, కెప్టెన్ జె.రామారావు, లెఫ్టినెంట్ జి.సునీత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అర్చన, గాయత్రి, వెంకటరత్నం పాల్గొన్నారు.

- విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ భారతీయులంతా తరతరాలుగా గర్వంగా గుర్తించుకునే రోజు జూలై 26 అని పేర్కొన్నారు. కార్గిల్ యుద్ధంలో సైనికుల పోరాటం, త్యాగం మరువలేమని కొనియాడారు. ఎన్‌సీసీ అధికారి డాక్టర్ కె.గీతాంజలి మాట్లాడుతూ సైనికుల ధైర్య సాహసాలు, త్యాగం వల్లే దేశ పౌరులు నిశ్చింతగా జీవించ గలుగుతున్నారన్నారు. కార్గిల్ దివస్‌ను పురస్కరించుకుని కళాశాల దత్తత గ్రామాల్లో కొవ్వొత్తులు వెలిగించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కిరణ్మయి, అరుణపద్మ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ నేడు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

బస్ బేలో బైక్‌ల పార్కింగ్



రేసపువానిపాలెం బస్ బేలో పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెంలోని బస్ బేలో ద్విచక్ర వాహనాలు పార్క్‌చేస్తున్నారు. ప్రయాణికులు వేచి ఉండాల్సిన బస్ బే వద్ద వాహనాల పార్కింగ్‌పై పలువురు ఇబ్బంది పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు, పోలీసులు దృష్టిసారించి బస్ బేలో ఎటువంటి వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వర్షపు నీరు రాకుండా చర్యలు



క్రైం పోలీస్ స్టేషన్‌పై ఏర్పాటు చేసిన గోనె సంచులు

సీతమ్మధార: వర్షం వస్తే ఫోర్త్‌టౌన్ క్రైం పోలీస్ స్టేషన్ లోపలికి నీరు రావడంతో సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల వారం రోజుల పాటు వర్షాలు కురవడంతో క్రైం పోలీస్ స్టేషన్‌లోకి నీరు చేరడంతో కేసులకు సంబంధించిన పలు పత్రాలు తడిచిపోయాయి. దీంతో వాన నీరు కారకుండా స్టేషన్ పైకప్పు మీద ఎస్ఐతోపాటు సిబ్బంది గోనె సంచులు ఏర్పాటు చేశారు. స్టేషన్ రేకుల షెడ్ కావడంతో ఒక వైపు నీరు లోపలకు వచ్చి కింద ఉన్న ఫ్లైవుడ్ తడిచిపోయేది. సిబ్బంది గ్లాసలతో వర్షపు నీరు పట్టి బయట పారవేసే పరిస్థితి ఉంది. అధికారులు పరిశీలించాలని పలువురు కోరుతున్నారు.

డయేరియాపై అవగాహన అవసరం

మహారాణిపేట: పిల్లలకు డయేరియాపై అవగాహన అవసరమని కేజీహెచ్ పిల్లల విభాగాధిపతి డాక్టర్ బీఎస్ చక్రవర్తి సూచించారు. నగరంలోని అన్ని జీవీఎంసీ పాఠశాలల్లో ఓఆర్ఎస్ వారోత్సవాలు నిర్వహించారు. చెంగలరావుపేట జీవీఎంసీ పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. డయేరియా నిరారణ, ఓఆర్ఎస్ ప్రాముఖ్యత, పరిసరాల శుభ్రతపై పిల్లలకు అవగాహన కల్పించారు.

ఫిర్యాదుదారులతో స్నేహభావంతో మెలగాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

పెదగంట్యాడ: ఫిర్యాదుదారుల పట్ల స్నేహభావంతో మెలగాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సిబ్బందికి సూచించారు. న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. స్టేషన్ అధికారులు, సిబ్బంది ఫిర్యాదుదారులతో ప్రవర్తిస్తున్న తీరును పరిశీలించారు. స్టేషన్‌ను ఆనుకుని ఉన్న ఖాళీ ప్రాంతాలను వ్యర్థాలతో నింపకుండా శుభ్రం చేయించి, మొక్కలు నాటాలని ఆదేశించారు. స్టేషన్ లోపల అన్ని ప్రాంతాలు పరిశీలించారు. స్టేషన్‌తో పాటు మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని సూచించారు. స్టేషన్లో సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పెండింగ్ కేసులు తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులతో మాట్లాడారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యలను పారదర్శకంగా విచారణ చేసి త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. సిబ్బంది విద్యార్హతలు తెలుసుకుని, వారి పనితీరుపై ఆరా తీశారు. స్టేషన్ ఆవరణలో ఉన్న సీజ్ చేసిన వాహనాలు పాడవకుండా చర్యలు చేపట్టాలన్నారు.

దొండపర్తి యూపీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో



దొండపర్తిలో నీటి నిల్వలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: దొండపర్తి యూపీహెచ్‌సీ పరిధిలోని పలు వీధుల్లో శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు పర్యటించి, నీటి నిల్వలను పరిశీలించారు. అనంతరం ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్, గర్భిణుల జాబితా తదితర అంశాలపై సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఆశా కార్యకర్తలు, సూపర్‌వైజర్లు ఎనీమియా బాధితులను గుర్తించి వారికి మాత్రలు అందజేయాలని తెలిపారు. అన్ని యూపీహెచ్‌సీల్లోనూ సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని, సీ-సెక్షన్ ప్రసవాలను నివారించాలని ఆరోగ్య సిబ్బంది, వైద్యులను కోరారు. అందరూ సమయపాలన పాటించాలని, స్టాప్ డయేరియా ప్రోగ్రాం మీద అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వర్షా కాలంలో కీటక జనిత వ్యాధులు రాకుండా చూసుకోవాలని చెప్పారు. దోమల నిర్మూలనకు శుక్రవారం డ్రైడే-ఫ్రైడే పాటించాలని స్థానిక ప్రజలను డీఎంహెచ్‌వో కోరారు. జిల్లా మలేరియా అధికారి తులసీరాజ్, జిల్లా మీడియా విస్తరణ అధికారి(డిమో) ఎం.నాగేశ్వరరావు, ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ టెక్నీషియన్లను ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల్

సీతంపేట: విశాఖలో పనిచేస్తున్న సెల్‌ఫోన్ టెక్నీషియన్లు అందరూ ఒక తాటిపై నడిచి తమ భవిష్యత్‌ను కాపాడుకోవాలని టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల్ పిలుపునిచ్చారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖలో సెల్‌ఫోన్ వృత్తిలో ఉన్న టెక్నీషియన్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. సెల్‌ఫోన్ టెక్నీషియన్లను కార్మికులుగా గుర్తించి విశ్వకర్మ యువజన పథకం కింద సదుపాయాలు కల్పించాలని కోరారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సెల్‌ఫోన్ టెక్నీషియన్లకు ట్రెనింగ్ అందించి ఉపాధి కల్పించాలన్నారు. ఇప్పటివరకు విశాలో 250 మందికి సభ్యత్వం ఇచ్చామని, ఈ నెలాఖరులోగా 400 మంది వరకు సభ్యులుగా చేరే అవకాశం ఉందని చెప్పారు. సెల్‌ఫోన్ టెక్నీషియన్లకు ఎప్పుడూ సొసైటీ సహాయ సహకారం ఉంటుందని తెలిపారు. సమావేశంలో యూనియన్ నాయకులు ప్రసాదు, దాము, రాజేష్, అహ్మద్, అముష్, వివిధ జిల్లాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో 31.2 కిలోల గంజాయి పట్టివేత



రైల్వే పోలీసుల అదుపులో ఐదుగురు గంజాయి రవాణాదారులు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గంజాయి రవాణా చేస్తున్న యువకులను రైల్వే పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఉన్నతాధికారుల ఆదేశాలతో శుక్రవారం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయ నాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది విశాఖ రైల్వే స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు నిర్వహించారు. బెంగుళూరుకు చెందిన ఆకాష్, పాడువకు చెందిన ఖేముండు, హర్యానాకు చెరందిన అవినాష్, బీహార్‌కు చెందిన అమృతకుమార్, కేరళకు చెందిన టామ్ అలెక్స్‌లు అక్రమంగా గంజాయిని రవాణా చేయడం గుర్తించారు. వీరు ఈ గంజాయిని విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా కేరళ, కర్ణాటక, హర్యానా, బిహార్ రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుంచి సుమారు రూ.1,04,500 విలువైన 31.2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్



ఎస్ఈబీ అధికారుల అదుపులో గంజాయి తరలిస్తున్న ముగ్గురు నిందితులు

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను శుక్రవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు అరెస్ట్ చేశారు. రామాటాకీస్ రోడ్డులోని ప్రభుత్వ కంటి ఆస్పత్రి ప్రాంతంలో ముగ్గురు వ్యక్తులు గంజాయి తరలిస్తున్నట్లు సమాచారంతో పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు. సుమారు 15.61 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కేరళ రాష్ట్రం త్రిశూల్‌కు చెందిన సఫాల్ సలీం, సునీల్‌కుమార్, అబిన్ సుబ్రాన్‌లు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ యు.సుబ్బారావు, ఇన్‌స్పెక్టర్ టి.వెంకటప్పలనాయుడు, ఎస్ఐ, ఎస్.ముసలనాయుడు, డీటీఎఫ్ ఎస్ఐ వేణుగోపాల్, హెచ్‌సి.శ్రీనివాస్, (టాస్క్‌ఫోర్స్) కానిస్టేబుళ్లు అప్పలనాయుడు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జూలో చిత్రలేఖన పోటీలు రేపు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో ఆదివారం విద్యార్థులకు పులులపై చిత్ర లేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు జూ క్యూరేటర్ నందనీ సలారియా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న ప్రపంచ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పోటీలు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఒకటో తరగతి నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పోటీలు జూలో జరుగుతాయన్నారు. ఒకటి నుంచి 5వ తరగతి వరకు పులులు, వాటి పిల్లలు, 6 నుంచి 10వ తరగతి వరకు పులులపై మానవ ప్రభావం, ఇంటర్మీడియెట్ నుంచి పీజీ వరకు పులులపై వాతావరణ మార్పులు అనే అంశాలుపై చిత్రాలు వేయాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 29న ఫొటోగ్రఫీ పోటీలు కూడా నిర్వహిస్తామన్నారు. విజేతలకు బహుమతులు, పాల్గొన్న అందరికీ సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు.

సమస్యలపై ఎంఈఎస్ బిల్డర్స్ అసోసియేషన్ నిరసన



చీఫ్ ఇంజనీర్(నేవీ)కు వినతిపత్రం అందిస్తున్న ఎంఈఎస్ బిల్డర్స్ అసోసియేషన్ విశాఖపట్నం బ్రాంచి ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను తక్షణం పరిష్కరించాలని మిలటరీ ఇంజనీరింగ్ సర్వీసెస్ బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విశాఖపట్నం బ్రాంచి చైర్మన్ జి.వి.రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు అసోసియేషన్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్‌లోని చీఫ్ ఇంజనీర్(నేవీ) ఎంఈఎస్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన దినం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రీ ఎన్‌లిస్ట్‌మెంట్ కేసులను ఆమోదించాలన్నారు. గ్యారిజన్ ఇంజనీర్‌తో పని పూర్తి సర్టిఫికెట్, వర్కింగ్ గ్రూప్ సిఫార్సులను అందజేసిన వెంటనే పెర్ఫార్మెన్స్‌లో సెక్యూరిటీలో 50 శాతం విడుదల చేయాలని కోరారు. పునర్విభజన ప్రక్రియ పూర్తయ్యే వరకు రూ.25 లక్షల నుంచి రూ. 50 లక్షల్లోపు కాంట్రాక్టులను ఈ క్లాస్ కాంట్రాక్టర్లకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఎల్-1 సిస్టం వల్ల పెద్ద కాంట్రాక్టర్లు నష్టపోతున్నారని, పనుల్లో నాణ్యత లోపిస్తుందని, దీనిపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. అనంతరం చీఫ్ ఇంజనీర్(నేవీ)(ఎంఈఎస్) అఖిలేంద్రసింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ సెక్రటరీ బి.వి.ఎస్.సుబ్బరాజు, వైస్ ప్రెసిడెంట్ పంకజ్ ప్రహ్లాదక, సీనియర్ వైస్ చైర్మన్ డి.సూరిబాబు, వైస్ చైర్మన్లు ఎస్.రాజశేఖర్, ఎంవీ రమణ, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.